26న పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

దానవాయిపేట లైన్‌లో 11కెవి ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 26న ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఇఇ నక్కపల్లి సామ్యూల్ తెలిపారు. రాజమహేంద్రవరం నగరంలోని గాంధీ పార్క్ ఏరియా, షర్మిల రెడ్డి ఏరియా, గానుగ వీధి, పాండురంగ స్వామి గుడి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే దివాన్‌చెరువు ప్రాంతంలో అదే రోజు ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకూ సబ్ స్టేషన్ మరమ్మతులను చేపడతామని తెలిపారు. ఈ కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని రాజానగరం మండలంలోని దివాన్ చెరువు, పాలచర్ల, శ్రీరాంపురం, డిబిఐ.రాజు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులంతా ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

మంచి జరిగితే తోడుగా నిలవండి

3వ విడత విద్యాదీవెనలో సభలో సిఎం జగన్

కొవ్వూరులో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

'మీ ఇంట్లో మీకు మంచి జరిగితే.. మీ జగనన్నకు తోడుగా మీరే సైనికులుగా కదలి రండి... నా బలం మీరే... నా నమ్మకం మీరే..' అని అన్నారు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి. రాబోయే రోజుల్లో అందరి చల్లని దీవెనలు, ఆశీస్సులు ఉండాలని కోరుతున్నానన్నారు. కొవ్వూరు వేదికగా విద్యాదీవెన ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం జరిగింది. సిఎం జగన్ హాజరై 9.95లక్షల మంది విద్యార్థులకు రూ.703 కోట్లు వారి తల్లుల బ్యాంకు ఖాతాకు బటన్ నొక్కి జమ చేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కొవ్వూరు నియోజకవర్గానికి వరాలజల్లు కురిపించారు. తన చెల్లి, హోం మంత్రి వనిత కోరిన విధంగా కొవ్వూరుకు డిగ్రీ కాలేజీ మంజూరు చేశామన్నారు. భవనాల కోసం రూ.30 కోట్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. మూడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల మరమ్మతులు, మూడు అంబేద్కర్ భవనాలు, ఎస్సీ కమ్యూనిటీ హాల్, కాపు భవనం, షాదీ ఖానాతో పాటు కొవ్వాడ కెనాల్‌పై కల్వర్టులను సైతం మంజూరు చేస్తున్నామన్నారు. వాటన్నిటికీ మంజూరు చేస్తున్నానని తెలిపారు. పేదలందరికీ నాణ్యమైన విద్యను అందించడమే తమ ధ్యేయమన్నారు.

ఈ సభలో తొలుత తానేటి వనిత మాట్లాడారు. విద్యా రంగంలో సిఎం జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి చరిత్ర సృష్టించారన్నారు. జగనన్న నాయకత్వంలో అందరికీ సమన్యాయం జరుగుతుందన్నారు. చిన్నారులకు చదువే ముఖ్యమనే ఉద్దేశంతో ప్రభుత్వ విద్యాసంస్థలను అభివృద్ధి చేశారన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివిన విద్యార్థులు కూడా ఏడాది స్టేట్ ర్యాంక్స్ సాధించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం విద్యను వ్యాపారం చేస్తే తమ ప్రభుత్వం విద్యను పేదవాడి హక్కుగా మార్చిందన్నారు. జగనన్న విద్యా దీవెన పథకం పొందుతున్న విద్యార్థులు, తల్లిదండ్రుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నత చదువులు చదివిన విద్యార్థులు ఇబ్బందులు పడకూడదని, ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూడకుండా ఇంటర్న్‌షిప్‌ను ప్రవేశపెట్టారన్నారు.

నమూనా చెక్కు అందిస్తున్న సిఎం జగన్

ఈ కార్యక్రమంలో మంత్రులు వేణు, బొత్స సత్యనారాయణ, ఎం.నాగార్జున, కొట్టుసత్యనారాయణ, శాసన మండలి ఛైర్మన్ కె.మోషేన్‌రాజు, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జి.జయలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకురాలు విజయ్‌కృష్ణన్, ఎంపీలు మిథున్ రెడ్డి, మార్గాని భరత్, పిల్లి సుభాష్ చంద్రబోష్, ఎంఎల్ఎలు చిర్ల జగ్గిరెడ్డి, జక్కంపూడి రాజా, శ్రీనివాసరావు, తలారి వెంకట్రావు, సత్తి సూర్యనారాయణ రెడ్డి, జడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, స్మార్ట్ సిటీ ఛైర్మన్ చందన నాగేశ్వర్, డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా ఛైర్మన్ మేడపాటి షర్మిలరెడ్డి, కలెక్టర్ కె.మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

తొలిసారి కొవ్వూరు నియోజక వర్గంకు చేరుకున్న ముఖ్యమంత్రి జగన్‌కు ఘన స్వాగతం లభించింది. హెలిప్యాడ్ వద్ద హోం మంత్రి తానేటి వనిత, జిల్లా ఇంఛార్జి మంత్రి వేణు, కలెక్టర్ కె.మాధవీలత, ఎస్‌పి సిహెచ్.సుధీర్ కుమార్, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్ షో నిర్వహించారు. దారి పొడవునా ప్రజలు పూలు జల్లుతూ స్వాగతం పలికారు. జగన్ చిరునవ్వుతో అభివాదం చేస్తూ ముందుకు సాగారు. సభా కార్యక్రమాలు అనంతరం హెలిప్యాడ్ చేరుకున్న ముఖ్యమంత్రి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయనకు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సిఎం జగన్, హోం మంత్రి వనిత

రోడ్‌షోలో సిఎం కాన్వాయ్‌పై పూల వర్షం

సభకు తరలొచ్చిన విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు

మొక్కలు నాటుతున్న అటవీ శాఖ సిబ్బంది

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రాంతీయ అటవీ పరిశోధనా సంస్థ డివిజనల్ ఫారెస్ట్ రిసెర్చ్ సెంటర్, స్టేట్ సిల్వి కల్చరిస్ట్ షేక్ సలాం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై బుధవారం అవగాహన కారక్రమం నిర్వహించారు. హకుంపేటలోని స్థానిక సిద్దార్థ క్యాంపస్‌లో ఈ కార్యక్రమం జరిగింది. పర్యావరన పరిరక్షణలో అందరు భాగస్వామ్యులు కావాలన్నారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ మొక్కలు పెంచాలన్నారు. పిల్లలకు మొక్కలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు డి.ఆశరేఖ మాట్లాడారు. పర్యవరణాన్ని కాపాడేందుకు మన వంతుగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పెట్రోల్ వాడకాన్ని తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ వాడకంతో కాలుష్యం మరింత పెరుగుతుందన్నారు. వాటి వల్ల పర్యావరణానికి ఆటంకం కలుగు తుందన్నారు. తద్వారా భావితరాలకు అవసరమైన భూగర్భ జలాలు లభ్యత చేకూరాదన్నారు. గాలి కాలుష్యం, ధ్వని కాలుష్య వల్ల తీవ్రమైన అనారోగ్యాలు దారితీస్తాయన్నారు. పర్యావరణానికి విఘాతం కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలన్నారు. కుటీర పరిశ్రమలు, బొమ్మలు తయారీ, నేత వస్త్రాలు, వంటి వాటిని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్ర్యమంలో ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి, ప్రిన్సిపల్ మల్లేశం, ఉపాధ్యాయులు అర్చన, మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలని జెసికి వినతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వినతిపత్రం అందిస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని జెసి తేజ్ భరత్‌కు కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొర్ల మాణిక్యం ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం అందించారు. బుధవారం జగనన్న విద్యా దీవెన కార్యక్రమం ప్రారంభోత్సవ నిమిత్తం కొవ్వూరు విచ్చేసిన సిఎం జగన్ కలిసి వినతి పత్రం అందించేందుకు ప్రయత్నించారు. సిఎం వినతిపత్రం అందుకోవాలని జెసిని ఆదేశించడంతో కాకినాడ జిల్లా అధ్యక్షుడు షేక్ రబ్బానీ గౌస్, ఉపాధ్యక్షుడు మూర్తిలతో కలిసి వినతి పత్రం అందజేశారు. 23 ఏళ్లుగా పని చేస్తున్న తమ సర్వీసు రెగ్యులరైజ్ చేసి న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికే నాలుగు సంవత్సరాలు కావొస్తుందని కనీసం ఇప్పటికైనా రెగ్యులరైజ్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే తెలంగాణలో కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేశారన్నారు.

అన్నదానం చేస్తున్న దాతలు

అన్నదానం అభినందనీయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కుటుంబ కార్యక్రమాలను ఆర్భాటంగా కాకుండా అన్నార్తుల వద్దకు వెళ్లి అన్నదానం చేయడం అభినందనీయమని రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ ఎం.సాంబశివరావు అన్నారు. బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ వద్ద స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న అన్నార్తుల వద్దకే అన్నదానం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పూర్వపు సహాయక సిటీ ప్లానర్ సిహెచ్.నారాయణరాజు కుమారుడు చింతలపాటి కాశీరాజు జ్ఞాపకార్థం 500 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ సిహెచ్.శ్రీనివాసరావు, రుడా ప్లానింగ్ అధికారి ఎన్.శ్రీనివాస్, అడిషనల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సిహెచ్.సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతానగరం, పుష్కర్ ఘాట్, స్వర్ణాంధ్ర వద్ధాశ్రమం వద్ద కూడా సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది . స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు, మేనేజర్ కృష్ణ, కేర్ టేకర్స్ శ్రీనివాసరాజు, రాజేష్, షేక్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిబిరాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలో గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో చిన్నారుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. సీతంపేట గ్రంథాలయంలో బుధవారం మ్యాజిక్‌షోను నిర్వహించారు. తొలుత ఎ.కృష్ణశర్మ కథల ద్వారా పిల్లలను చైతన్య పరిచారు. పంచతంత్రం, కొంగ బావ కథలను చెప్పారు. పిచ్చుక రాంబాబు తెలుగు పద్యాలు నేర్పించారు. జెవివి నాయకులు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో సిహెచ్.శ్రీరాములు మ్యాజిక్‌షోను నిర్వహించారు. సమాజంలో జరిగే మూఢనమ్మకాలను ఎలా పోగొట్టుకోవాలి అనే దానిపై మ్యాజిక్ చేసి చూపించారు. అరచేతిలో కర్పూరం వేగించడం, టెంకాయతో మ్యాజిక్ గ్లాసులను గాలిలో ఎగరవేయడం, వాటిలో ఉన్న రహస్యాలను తెలిపి పిల్లలతో చేయించారు. అనంతరం

కడియంలో...

సీతంపేట గ్రంథాలయంలో కాగిత పూలతో విద్యార్థులు

శ్రీరాములును సత్కరించారు. అలాగే డ్రాయింగ్, క్రాఫ్ట్ టీచర్ ఐ.రాజ్‌కుమార్ చిత్రలేఖనంలో రంగులను ఎలా వాడాలో నేర్పించారు. పేపర్లతో బొమ్మల తయారీ నేర్పించారు. సత్యనారాయణమూర్తి వేదిక్ మ్యాథమెటిక్స్ చెప్పారు. గ్రంథాలయ అధికారి కె.సుగుణకుమారి మాట్లాడుతూ జూన్ 11వరకూ ఈ శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. గ్రంథాలయ సిబ్బంది

సీతంపేట గ్రంథాలయంలో శ్రీరాములు మ్యాజిక్‌షో

ఎం.వీరలింగం, డి.రాజు తదితరులు పాల్గొన్నారు. గ్రంథాలయ స్టూడెంట్స్ కార్యక్రమం లో సహాయ సహకారాలు అందించారు.

కడియం శాఖా గ్రంథంలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం బుధవారం నాటికి 17వ రోజుకు చేరింది. సాధు జనార్ధనరావు మెమోరియల్ సొసైటీ నుంచి ఎస్‌వి.కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. కాలం, పని, సంస్కృతి, పోలిక, విజయం, సమస్య, పెద్ద వాళ్ల పట్ల విధేయత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ శ్రీదేవి నిర్మల, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా కళాశాలలో చేర్పించాలని ప్రచారం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండల కేంద్రం ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో ప్లస్ టుగా ఏర్పాటు చేసిన మహిళా కళాశాలలో పిల్లలను చేర్పించాలని ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వారణాసి విశ్వప్రసాద్ కోరారు. ఈ మేరకు మండలంలోని అనేక గ్రామాల్లో ప్రచారం నిర్వహించామన్నారు. బుధవారం తాడిపర్రులో ప్రచారం చేశామన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినిలు మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారన్నారు. అదే స్ఫూర్తిగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన మహిళా కళాశాలలో ఇంటర్మీడియట్‌లో చేర్పించేలా విద్యార్థినుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంపిసి, సిఇసి గ్రూపులను అన్ని సౌకర్యాలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, పీజీ టీచర్లు బి.సుబ్బారావు, కె.రాంప్రసాద్ పాల్గొన్నారు.

నల్లజర్ల పిహెచ్‌సిలో తనిఖీలు

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల పిహెచ్‌సిలో జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టిబి నివారణ అధికారి డాక్టర్ ఎన్.వసుంధర ఆధ్వర్యంలో ప్రత్యేక బందం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఉద్యోగులతో సమావేశమయ్యారు. అనీమియా ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు రక్తహీనతను గుర్తించడం, అందుకు అవసరమైన నివారణ చర్యలను వివరించారు. అసంక్రమణ వ్యాధుల నివారణలో భాగంగా దీర్ఘకాలిక వ్యాధులైన బిపి, మధుమేహం బాధితుల గుర్తింపు, వారికి అందిస్తున్న వైద్యంపై ఆరా తీశారు. టిబి వ్యాధితో మండలంలో ఎంతమంది బాధపడుతున్నారో కనుగొన్నారు. వారికి అందిస్తున్న చికిత్స గురించి, వారికి చేస్తున్న పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎవరూ టిబితో మరణించకూడదని, వారికి మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అన్ని రకాల మాతా శిశుసేవలన్నీ అర్‌సిహెచ్ పోర్టల్‌లో అప్ లోడ్ చేయాలన్నారు. ప్రసవ మరణాలను పూర్తిగా అరికట్టాలన్నారు. ఆసుపత్రి ఒపిపై ఆరా తీశారు. నల్లజర్ల పిహెచ్‌సి పరిధిలో ఉన్న 12 మంది టిబి బాధితులకు ఆరు నెలల పాటు పోషకాహారం అందించేందుకు 'నిక్షయమిత్ర'లను గుర్తించాలన్నారు. ఈ సమయంలో పిహెచ్‌సికి వైద్యం నిమిత్తం విచ్చేసిన ఆవపాడుకు చెందిన కుష్ఠ వ్యాధి బాధితుడు పుల్లారావును పరామర్శించారు. బాధితునికి వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో బాగంగా నవశకం పెన్షన్ మంజూరు కోసం ప్రతిపాదనలు తక్షణమే పంపించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పోతవరం పిహెచ్‌సిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.లక్ష్మీదేవి, శివ కుమార్, శ్యామ్ సుందర్, టిబి సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ వి.ఆశా జ్యోతి, నల్లజర్ల వైద్యాధికారులు తెల్లం గంగాధరరావు, మహ్మద్ సిరాజుద్దీన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కలిదిండి వెంకట చంద్రశేఖరరాజు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ వసుంధర

కార్టూ'నిజం'

ఈ సర్కారుల విధానాల వల్ల నేను అసలు జేబులు పెట్టించడం మానేశానురా..!

కంటి పరీక్షలు విధిగా నిర్వహించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తక్కువ బరువుతో పుట్టిన బిడ్డలకు, నెలలు నిండకుండా పుట్టిన బిడ్డలకు రెట్టినో పతి ఆఫ్ ప్రీ మెచ్యూరిటీ కంటి పరీక్షలు విధిగా చేయించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలియజేశారు. బుధవారం స్థానిక రాజమహేంద్రవరం గవర్నమెంట్ హాస్పటల్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర బాల స్వస్థ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ డిస్టిక్ ఎర్లీ ఇంట్రవెన్షన్ సెంటర్, గౌతమి నేత్రాలయ సహకారంతో నెలలు నిండకుండా పుట్టిన బిడ్డలకు బరువు తక్కువతో పుట్టిన బిడ్డలకు రెట్టినో పతి ఆఫ్ ప్రీ మెచ్యూరిటీ కంటి పరీక్షలు ప్రతి శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలోని పిల్లల విభాగంలో నిర్వహిస్తారన్నారు. ఆయన మాట్లాడుతూ నెలలు నిండకుండా బరువు తక్కువతో పుట్టిన బిడ్డల్లో కంటి దోషం ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. ముందుగా గుర్తిస్తే కంటి చూపు పోకుండా కాపాడొచ్చన్నారు. రాష్ట్ర బాల స్వస్థ కార్యక్రమం కోఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ మాట్లాడుతూ బరువు తక్కువ మరియు నెలలు ఉండకుండా పుట్టిన పిల్లల కంట్లో రక్తనాళాల ఎదుగుదల సరిగా ఉండదన్నారు. అందువల్ల కంటి చూపు తగ్గుతుందన్నారు. వారికి విధిగా రెటీనా పరీక్షలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. రెండు వారాల తదుపరి పరీక్షించి రెటీనా మెచ్యూరిటీ జరగక పోతే వీరికి ఉచితంగా గౌతమి నేత్రాలయం ట్రస్ట్ ద్వారా చికిత్స చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఇంద్రజ, మెడికల్ ఆఫీసర్ స్వాతి భవాని, గౌతమి నేతరాలయ సిబ్బంది శివ, జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ ఆప్తోమెట్రిస్ట్ మిల్టన్ ఎపిడమాలజిస్ట్ సుధీర్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో అన్నదానం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లులోని భవిత కేంద్రంలో వికలాంగ చిన్నారులకు కవిలి సత్యనారాయణ, సూర్యకాంతం జ్ఞాపకార్థం వారి కుమారులు వెంకటేశ్వరరావు, సర్వేశ్వరరావు, రాఘవేంద్రరావు, మురళీకృష్ణప్రసాద్, వారి కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు హాట్ బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ వి.ఖాదర్‌బాబు, ఉపాధ్యాయులు రామచంద్రరావు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రూ.44 కోట్ల విద్యాదీవెన నిధుల జమ

ప్రజాశక్తి - చాగల్లు

జగనన్న విద్యాదేవన కార్యక్రమంలో భాగంగా చాగల్లు మండలం లో నాలుగో విడతగా 1281మంది విద్యార్థులకు 44 కోట్లు 83 లక్షల 50 వేలు విద్యార్థుల తల్లి ఖాతాలకు జమ అవుతున్నట్లు ఎంపీడీవో బి రాంప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కొవ్వూరు నియోజవర్గ పరిధిలో బుధవారం జరిగిన జగనన్న విద్యా దేవన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ చేతుల మీదగా ప్రారంభించినట్లు ఆయన తెలిపారు

చెరుకుమిల్లిలో 3వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని చెరుకుమిల్లిలో కొవ్వూరమ్మ గుడి, సల్లాలమ్మ గుడి వద్ద బుధవారం 3వేల మందికి అన్నదాన నిర్వహించామని ఆలయాల నిర్మాణ కర్త గూడూరి కోదండ రాముడుశ్రీను తెలిపారు. ఆయన మాట్లాడుతూ 12ఏళ్ల క్రితం కొవ్వూరమ్మ గుడి నిర్మించారన్నారు. ఇటీవల సల్లాలమ్మ గుడి నిర్మాణాన్ని గూడూరి కోదండ రాముడుశ్రీను, గూడూరు వెంకటరమణ దంపతుల సౌజన్యంతో నిర్మించామన్నారు. అందులో భాగంగా అన్నదానం నిర్వహించామని తెలిపారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ అన్నదానంలో పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - చాగల్లు

పర్యావరణ రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిడిఒ బి.రామ్‌ప్రసాద్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో 23న ప్లాస్టిక్ వాడకం తగ్గింపు, 24న సైకిలు వాడకం, 25న గ్రామపంచాయతీ పరిధిలోని పనిచేయని వీధిలైట్లు మార్పు, 26న తడి-పొడి చెత్త, 27న ప్లాస్టిక్ సంచుల నిర్మూలన, వాటి స్థానంలో కాగితాల బ్యాగులు, గుడ్డ సంచు బ్యాగులు తీసుకురావడం కార్యక్రమాలను పంచాయతీలో అమలు చేయాలని కోరారు.

ఆటో కార్మికుల యూనియన్ ఏర్పాటు

ప్రజాశక్తి - నిడదవోలు

ఆటో యూనియన్ సభ్యులతో రాంబాబు తదితరులు

నిడదవోలు రైల్వే స్టేషన్ ఆటో పాయింట్ కార్మికులు బుధవారం యూనియన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. రైల్వే స్టేషన్ వద్ద నున్న ఆటో ఒనర్స్ వర్కర్స్ సమావేశం ఎల్లే కృష్ణంరాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా సిఐటియు నాయకులు జువ్వల రాంబాబు, సిఐటియు మండల కార్యదర్శి గుమ్మాపు డానియల్ హాజరయ్యారు. రాంబాబు మాట్లాడుతూ ఆటో కార్మికులు క్రమశిక్షణ కలిగి ఉండి ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. 'గోదావరి ఆటో వర్కర్స్ యూనియన్' గౌరవాధ్యక్షులుగా జువ్వల రాంబాబు, అధ్యక్షులుగా పివి.ప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఎం.విష్ణువర్ధనరావు, కార్యదర్శిగా సైదు ఖాన్, సహాయ కార్యదర్శిగా టి.రవి, కోశాధికారిగా పాలా శ్రీనివాస్, సహాయ కోశాధికారిగా జి.శ్రీనివాసరావు, కమిటీ సభ్యులుగా ఎల్లే కృష్ణంరాజు, ఎం.సూరిబాబు, ఎ.వెంకటరాజు, ఎ.శ్రీను, ఎమ్‌డి.నౌషాద్, ఏడు కొండలు, హోసన్నా, షేక్.బాషా, దేవి ఎన్నికయ్యారు.

సిఎంను కలిసిన చందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కొవ్వూరు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని వైసిపి రాజమహేంద్రవరం రూరల కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు. నియోజక వర్గంపై చర్చించారు, అలాగే 15వ ఫైనాన్స్ నిధులు రూరల్ పంచాయతీలకు విడుదల చేయాలని, అభివృద్ధి పనులకు నియోజక వర్గానికి కేటాయించిన రూ.20 కోట్ల విడుదల చేయాలని సిఎంను కోరారు. సిఎం పర్యటనను జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

పురుగు మందు తాగిన కౌలు రైతు మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం చొల్లంగి గ్రామానికి చెందిన బొడ్డు గంగాధర్ రావు (40) పురుగుల మందు తాగి కాకినాడ జిజిహెచ్ లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కోరంగి ఎస్.ఐ .పిఃశ్రీనివాస్‌కుమార్ తెలిపారు. చొల్లంగి వెంకటేశ్వర స్వామి దేవస్థానం భూమి కౌలు చేస్తున్న బొడ్డు గంగాధరరావుకు ఇటీవల రెండు పంటలుగా నష్టం వాటిల్లింది. దీంతో అప్పులు ఎక్కువయ్యాయి. అప్పుల బాధతో తాగుడుకు బానిసైన గంగాధర్‌రావు మంగళవారం భార్యతో గొడవపడి చేనుకు ఉపయోగించే పురుగు మందు తాగాడు. భార్య కుటుంబ సభ్యులు వెంటనే గంగాధర్రావును 108లో కాకినాడ జిజిహెచ్ కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసకుమార్ తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - గండేపల్లి

ప్రత్తిపాడు, గండేపల్లి హైవేలో జరుగుతున్న చైన్ స్నాచింగ్ కేసుల దర్యాప్తులో భాగంగా గొల్లప్రోలు మండలం తాడిపత్రి గ్రామానికి చెందిన తంగేళ్ల శేఖర్ అనే వ్యక్తిని ప్రత్తిపాడు పోలీస్‌లు అదుపులోకి తీసుకుని ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో అతను దొంగిలించిన 16 గ్రాముల బంగారు జిగిని, గండేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగలించిన 24 గ్రాముల నల్లపూసల తాడును స్వాధీనపరుచుకుని నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపారు. చైన్ స్నాచింగ్ కేసును త్వరితగతిన పరిష్కరించిన జగ్గంపేట సిఐ బి.సూర్యఅప్పారావు, ఎస్ఐ వై. గణేష్ కుమార్‌లను పెద్దాపురం డిఎస్‌పి కె.లతాకుమారి అభినందించారు.

పేకాడుతున్న ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో తమకు వచ్చిన సమాచారం మేరకు పేకాటశిబిరంపై దాడి చేసి ఐదుగురుని అదుపులోకి తీసుకున్నట్టు జగ్గంపేట ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. వారి నుంచి రూ.3,400 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని గురువారం కోర్టుకు హాజరుపరచనున్నట్టు తెలిపారు.

యువతి కిడ్నాప్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి-కాట్రేనికోన

కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని రాజానగరం గ్రామానికి చెందిన గంగాభవానీ అనే యువతి కిడ్నాప్‌నకు గురైనట్టు తండ్రి ఓలేటి సత్య ప్రసాద్ కాట్రేనికోన పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి ఇంటర్ వరకూ చదువుకుని స్థానిక ఎంపిపి పాఠశాలలో తాత్కాలిక ట్యూటర్‌గా పని చేస్తోంది. అదే గ్రామానికి చెందిన వివాహితుడు కర్రి దుర్గాప్రసాద్ యువతిపై తరచూ లైంగిక వేధింపులకు పాల్పడేవాడు. దీంతో యువతి బంధువులు అతడిని మందలించారు. ఈ నెల 22న రాత్రి ఇంటిలో నిద్రపోయిన భవానీ మరునాడు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వారిని విచారించారు. దుర్గాప్రసాద్ తన కూతురిని బలవంతంగా తీసుకుపోయినట్టు తెలియడంతో యువతి తండ్రి ఫిర్యాదు చేసారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-మండపేట

వ్యక్తి అదశ్యంపై మండపేట పట్టణ పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. సరికొండ యువ దుర్గాప్రసాద్ సరికొండ బేబీ, ఇద్దరు సంతానంతో కలిసి మండలంలోని తాపేశ్వరం గ్రామంలో నివాసం ఉంటున్నారు. వేసవి సెలవులు నేపథ్యంలో అత్తవారింటికి కుటుంబంతో కలిసి మండపేట వచ్చాడు. ఈ నెల 22వ తేదీన తెల్లవారుజామున 5 గంటల సమయంలో టీ తాగి వస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రసాద్ తిరిగి రాకపోవడంతో బంధువులు స్నేహితులు ఇళ్లల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నియంత్రణ పద్ధతులను వివరిస్తున్న శాస్త్రవేత్తలు

జీవ నియంత్రణతో తెల్లదోమ నివారణ

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

జీవ నియంత్రణ ద్వారా కొబ్బరిని ఆశించే సర్పిలాకార తెల్లదోమను నివారించవచ్చని ఉద్యానవన పరిశోధన కేంద్రం (అంబాజీపేట) ప్రిన్సిపల్, శాస్త్రవేత్త డాక్టర్ బి.శ్రీనివాసులు రైతులకు సూచించారు. నంగవరం సచివాలయంలో స్థానిక సర్పంచ్, డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన కొబ్బరి రైతులకు తెల్ల దోమ నివారణపై సూచనలు ఇచ్చి అవగాహన కల్పించారు. అవసరమైనంత పరాన్న భుక్కులను ప్రయోగశాలలో ఉత్పత్తి చేసి క్షేత్రస్థాయిలో విడుదల చేయడం ద్వారా తెల్లదోమ సంతతిని అదుపులో ఉంచవచ్చని చెప్పారు. ఈ మిత్ర పురుగులు తెల్లదోమనే కాక ఇతర రసం పీల్చే పురుగులైన పేనుబంకను కూడా నియంత్రించగలవని ఉద్యానవన శాస్త్రవేత్త శ్రీనివాసులు అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు జంపన బాపిరాజు, రాయపురెడ్డి నాగు, బిబిఆర్ ప్రసాద్, యాళ్ల చిన్న, ఉద్యానవన శాస్త్రవేత్తలు బి.గోవర్ధన్, ఎం.అనూష, ఉద్యానవన అధికారి ఎం.శైలజ తదితరులు పాల్గొన్నారు.



రేవులకు చేపట్టిన మరమ్మతులు పనులు

పాంచాల రేవులకు మరమ్మతులు

ప్రజాశక్తి - పి.గన్నవరం

పలు గ్రామాల్లో ప్రధాన పంట కాలువపై పాడై పాంచాల రేవులకు మరమ్మతు పనులు చేపడుతున్నామని ఎంపిపి అంబటి భూలక్ష్మి తెలిపారు. ఈ యర్రంశెట్టివారిపాలెంలో పాంచాల రేవుల మరమ్మతు పనులను స్థానిక నాయకులు అంబటి కోటేశ్వరరావు, యర్రంశెట్టి తాతకాపు పరిశీలించారు.

యానాం వార్తలు

సమావేశంలో పాల్గొన్న జన విజ్ఞాన వేదిక సభ్యులు

చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి - యానాం

సర్వతోముఖాభివృద్ధికి చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నామని పర్యావరణ, సైన్స్ సంబంధిత విషయాలపై అవగాహన కల్పిస్తున్నామని జన విజ్ఞాన వేదిక యానాం శాఖ అధ్యక్షుడు ఆనాల వీరభద్రరావు తెలిపారు. స్థానిక యానాం పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన జనవిజ్ఞానవేదిక సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి మొహిబుల్లా ఖాన్, ప్రముఖ కవి దాట్ల దేవదానంరాజు, రాష్ట్ర ప్రతినిధి కెవివి సత్యనారాయణ, కె.జానకిరాముడు పాల్గొన్నారు.

4న కానిస్టేబుల్ పోస్టులకు రాతపరీక్ష

పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ లో పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు వచ్చే నెల 4న ఆదివారం రాతపరీక్ష నిర్వహిస్తున్నట్లు బుధవారం పుదుచ్చేరి ప్రభుత్వకార్యదర్శి (డివిఅండ్ఆర్) ఎగ్జామ్ సెల్ ప్రకటనలో పేర్కొంది. పుదుచ్చేరిలో మొత్తం 9 పరీక్షా సెంటర్లను అభ్యర్థుల రాతపరీక్ష కోసం సిద్ధం చేసినట్లు తెలిపారు. పరీక్ష ఆరోజు ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. అభ్యర్థులు తమ హాల్టికెట్లను recruitment.Py.gov.in వెబ్సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవాలని కోరారు. అభ్యర్థులకు ఏవైనా సందేహాలు, సహాయం కోసం 0413-2233338 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు. ఇప్పటికే శారీరక ధారుఢ్య పరీక్ష పాసయిన వారంతా రాతపరీక్షకు అర్హులయిన నేపథ్యంలో వీరంతా శాతపరీక్షను రాయనున్నారు.

యానాం బాడ్మింటన్ క్రీడాకారులతో క్లబ్ సెక్రటరీ కాపగంటి సుమన్

ముగిసిన బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం

బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ సెక్రటరీ కాపగంటి సుమన్ ఆధ్వర్యంలో ఉచిత బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణా శిబిరాన్ని కోచ్ బొట్టా శ్రీనివాస్ సీనియర్ క్రీడాకారుడు సాయి రెడ్డి విజయ్ అధ్యక్షతన ఏప్రిల్ 28వ తేదీ నుండి ఈనెల 22 తేదీ వరకు ఉదయం సాయంకాలం 25 రోజులపాటు 40 మంది క్రీడాకారులకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ నెల 23,24 తేదీల్లో క్రీడాకారులను సీనియర్స్, జూనియర్స్ గా విభజించి టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో విజయం సాధించిన క్రీడాకారులకు బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ సెక్రటరీ కాపుగంటి సుమన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ జిల్లాలో పరిశ్రమల్లో భద్రతతో పాటు కాలుష్య నియంత్రణ ప్రమాణాలను పూర్తిస్థాయిలో పాటించేలా అధికారులు పటిష్ట పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. బుధ వారం కలెక్టరేట్ కోర్టుహాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక, ఎగుమ తుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. తొలుత గత సమా వేశంలో తీర్మానించిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలపై చర్చిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ పరిశ్ర మల్లో భద్రతతో పాటు పారిశ్రామిక కార్యకలాపాల వల్ల పర్యావరణం కలుషితం కాకుండా ముఖ్యంగా జల వనరులపై ప్రత్యేకంగా దృష్టి సారించా లన్నారు. అవసరమైన చోట సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్‌టిపి) ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పారిశ్రామిక యూనిట్లకు సత్వర అనుమతుల జారీకి అమల్లో ఉన్న ఎపి సింగిల్ డెస్క్ విధానం కింద 2023, ఏప్రిల్ 11 నుంచి ఈనెల 22 వరకు 53 దరఖాస్తులకు గాను వివిధ శాఖల పరిధిలో 35 దరఖాస్తులు ఆమోదం పొందినట్లు వివరించారు. మిగిలిన దరఖాస్తులను నిర్దిష్ట ఎస్ఎల్ఏ గడువులోగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలకు సంబంధించి పారిశ్రామిక అభివృద్ధి విధానాలు (2015-20, 2020-23), వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకం పరిధిలో 25 యూనిట్లకు ప్రోత్సాహకాల క్రింద రూ. 2.53 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం టి.మురళి, ఎడి కె.కృష్ణారావు, ఎల్‌డిఎం, సిహెచ్‌ఎస్‌వి ప్రసాద్, డిపిఒ ఆర్.విక్టర్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి.రాధాకృష్ణ, ట్రాన్స్‌పోర్టు అధికారి పివి. సాయిప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సమీక్ష

బుధవారం కలెక్టరేట్ కోర్టుహాల్‌లో ఐరాస సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో జిల్లాలో పురోగతిపై విద్య, ఆరోగ్యం, ఐసిడిఎస్ తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. చిన్నారులు, కిశోర బాలికలు, గర్భిణుల ఆరోగ్య పరీక్షలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. పాఠశాలల్లో డ్రాప వుట్‌లను గుర్తించి తిరిగి చేరేలా చూడాలన్నారు. ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి (జిఇఆర్), గర్భిణుల ఆరోగ్యం, పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, రక్త హీనత పరీక్షలు, సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు తదిత రాలపై కలెక్టర్ కృతికా శుక్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఆర్.రమేష్, ఐసిడిఎస్ పీడీ కె.ప్రవీణ, మెప్మా పీడీ బి.ప్రియంవద తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

అధికారులు సమీక్షిస్తున్న డిఎంహెచ్ఓ డాక్టర్ రమేష్

మాతా శిశు మరణాల నివారణకు కృషి

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో మాతా, శిశు మరణాల నివారణకు వైద్య, స్త్రీశిశు సంక్షేమ శాఖలు అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఆర్.రమేష్ కోరారు. బుధవారం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలు, మాతా, శిశు మరణాల సమీక్ష, నివారణపై ఏర్పాటైన జిల్లా స్థాయి కమిటీల సమావేశాలు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఆర్.రమేష్ అధ్యక్షతన జరిగాయి. సమావేశంలో తొలుత 2023 తొలి త్రైమాస కాలంలో జిల్లాలో జరిగిన 4 మాతా మరణాలు, 5 శిశు మరణాలకు వాస్తవ కారణాలు, అటువంటివి పునరావతం కాకుండా చేపట్టవలసిన చర్యలపై ఆడిట్ నిర్వహించారు. జిల్లాలో హైరిస్క్ గర్భధారణ గుర్తించిన మహిళల ఆరోగ్య స్థితిపై ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు నిరంతర పర్యవేక్షణ పాటించి, ఆసుపత్రిలో సురక్షితంగా ప్రసవించి తల్లీ, బిడ్డ క్షేమంగా తిరిగి ఇంటికి వెళ్లేలా చూడాలని ఆయన కోరారు. ముఖ్యంగా రక్తహీనత కారణంగా గర్భిణులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు, పౌష్టికాహారం సక్రమంగా తీసుకునేలా ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు. సురక్షిత ప్రసవం కావడానికి గర్భిణులు పాటించ వలసిన జాగ్రత్తలపై వైద్య అధికారులు, ఐసిడిఎస్ అధికారులు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు జిల్లాలో స్థాయిలో నిర్వహించాలన్నారు. ప్రతి గర్భిణి ఇంటి వద్ద కాకుండా, వైద్య పర్యవేక్షణలో ఆసుపత్రిలోనే పురుడు పోసుకునేలా కార్యకర్తలు చూడాలన్నారు.

అనంతరం జరిగిన గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో క్రొత్తగా 5 అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ల ఏర్పాటుకు అనుమతులు, రెండు స్కానింగ్ సెంటర్లకు అనుమతుల పునరుద్ధరణ, 3 స్కానింగ్ సెంటర్లలో పరికరాలు, అడ్రస్ మార్పులకు కమిటీ ఆమోదం తెలిపింది. అలాగే జిల్లాలో ఆడ శిశు జననాల సంఖ్య తక్కువగా నమోదౌతున్న ప్రాంతాల్లోని స్కానింగ్ సెంటర్లపై నిశిత నిఘా ఉంచి, అనుమానిత సెంటర్లలో పోలీస్ శాఖ సమన్వయంతో రహస్యంగా డెకాయ్ ఆపరేషన్‌లు నిర్వహించాలని డిఎంహెచ్ఒ మండల, డివిజన్ కమిటీలను కోరారు. గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధంపై చట్టంలో నిర్దేశించిన అంశాలను అన్ని స్కానింగ్ కేంద్రాల్లో బోర్డులపై ప్రదర్శించాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో ఐసిడిఎస్ పీడీ కె.ప్రవీణ, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పి.బి.విష్ణువర్ధని, ఆర్‌బిఎస్‌కె కోఆర్డినేటర్ డాక్టర్ సత్యనారాయణ, జిజిహెచ్ గైనిక్ విభాగాధిపతి డాక్టర్ లావణ్యకుమారి, పిడియాట్రీషియన్ డాక్టర్ ఎంఎస్ రాజు, డిపిహెచ్‌ఎంఒ పి.వి. రమణమ్మ, డెమో సి.హెచ్.రాజు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చక్రవర్తి, బీబీ సపూరా, వైద్యాధికారులు, ప్రయివేట్ ఆసుపత్రుల ప్రతినిధులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ప్రజాశక్తి - పెద్దాపురం

రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి టిడిపి నాయకుడు, కార్యకర్త కషి చేయాలని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. బుధవారం స్థానిక సుధా కాలనీలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో ఎంఎల్ఎ చిన్నరాజప్ప మాట్లాడుతూ పట్టణ పరిధిలోని ప్రతి వార్డులోనూ, ప్రతి గ్రామంలోనూ ఇప్పటి నుండే టిడిపి కార్యకర్తలను ఎన్నికలకు సిద్ధం చేయాలన్నారు. రాజమహేంద్రవరంలో ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే మహానాడుకు కార్య కర్తలు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. బుధవారం స్థానిక సుధా కాలనీలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా మహానాడు దిగ్విజయంగా జరుగుతుందన్నారు. మహానాడుకు బస్సులు వేస్తే సీజ్ చేస్తామని అధికారులు బెదిరిస్తున్నారన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, టిడిపి పట్టణ అధ్యక్షులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, టిడిపి మండల అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు, ఎలిశెట్టి నాని, కాకినాడ రామారావు తదితరులు పాల్గొన్నారు. **జగ్గంపేట :** మహానాడు విజయవంతం చేయాలని రాష్ట్ర తెదేపా ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ జగ్గంపేట నియోజకవర్గం ప్రజలకు పిలుపునిచ్చారు. జగ్గంపేటలోని బుధవారం కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహానాడును విజయవంతం చేయాలని సుమారు 20 నుంచి 30 వేల మంది అభిమానులను సేకరించి తీసుకురావాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథిగా కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా 100 మినీ మహానాడు జరుపుకు న్నామని అమెరికాలో మినీ మహానాడు జరుపుకోవడానికి ఆ దేశం ఇచ్చిన అనుమతి ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శిలు ఎస్‌విఎస్ అప్పలరాజు, కోర్పు లచ్చయ్య దొర, నాలుగు మండలాల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, చదరం చంటిబాబు, మంగరాతు రామకృష్ణ, కన్న బాబు, అడపా భరత్‌బాబు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, ఉంగరాల రాము, జంపన సీతారామచంద్ర వర్మ, పాండ్రంకి రాంబాబు, మండల మహిళా అధ్యక్షురాలు నకిరెడ్డి సూర్యవతి, మండలాల ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇన్చార్జులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల నెహ్రూ

ఈగలు, దోమలతో టిడ్కో వాసుల అవస్థలు

ప్రజాశక్తి రామచంద్రపురం

పగలు ఈగలతోనూ రాత్రి దోమలతోనూ ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నామని టిడ్కో కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామచంద్రపురం పట్టణానికి ఆనుకుని ఉన్న కొత్తూరులో ప్రభుత్వం నిర్మించిన 1,084 గహాల్లో ప్రజలు నివాసం ఉంటున్నారు. సమీపంలో కోళ్ల ఫారాలు ఉండటంతో ఈగలు అధికమయ్యాయి. ప్రతి గహంలో ఈగలు పెరిగిపోవడంతో ప్రజలు ఇక్కట్ల గురవుతున్నారు. మహిళలు వంట చేసేందుకు వీలు లేకుండా పోతుందని విసుగు చెందుతున్నారు. వంటగదిలోను పాత్రలపైన మంచినీళ్లపైన నిత్యం ఈగలు వాలడంతో భోజనం చేసేందుకు కూడా వీలు లేకుండా ఉంటోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగలంతా ఈగలతోనూ రాత్రి అయితే దోమలతోనూ కాపురం చేయాల్సి వస్తుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి అధికారులు చర్యలు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని లేకుంటే పలు వ్యాధులకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక చిన్న పిల్లలు ఈగల కారణంగా ఆహారం కూడా సరిగ్గా తీసుకోవడం లేదని దీన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీలోని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

టిడ్కో గృహాల్లో ఈగలు

వంట చేసుకునే వీలు కూడా లేదు

టిడ్కో కాలనీలో పెరిగిపోయిన ఈగలవల్ల కనీసం వంట చేసుకునే వీలు లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈగలతో గడపాల్సి వస్తోంది. దీంతో వంట చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నాము. వంటలపైన ఈగలు వాలడం వల్ల ఏమీ తినడానికి ఉండటం లేదు. సాయంత్రం అయ్యేసరికి వికారం వాంతులు అవుతున్నాఇ. దయచేసి అధికారులు ఈగలు పేరగకుండా చర్యలు తీసుకోవాలి.

\- పి.కాంతం గహిణి,

కోళ్ల ఫారం వల్లే ఈగల వృద్ధి

టిడ్కో గహాల చుట్టూ ఉన్న కోళ్ల ఫారం వల్ల రోజురోజుకూ ఈగలు పెరిగిపోతున్నాయి. కనీసం నడవడానికి కూడా వీల్లేకుండా ఉంది. రాత్రి సమయంలో దోమలతోనూ పగలు ఈగలతో సతమతమవుతున్నాము. వెంటనే మున్సిపల్ అధికారులు ఈగలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి. లేకుంటే అందరూ అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది.

\- కె.తేజ టిడ్కో కాలనీ వాసి.

పోలీస్ స్టేషన్‌లో పనిచేయని ఫోన్

ప్రజాశక్తి-రామచంద్రపురం

అత్యవసర పరిస్థితుల్లో బాధితులు పోలీస్ స్టేషన్ ఫోన్ చేస్తే అప్పుడు ఫోన్ పని చేయకపోతే పరిస్థితి ఏమిటని పలువురు బాధితులు ప్రశ్నిస్తున్నారు. రామచంద్రాపురం మండలంలోని ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌లో టెలిఫోన్ గత మూడు నెలలుగా పని చేయడం లేదు. సుమారు 30 గ్రామాల ప్రజలు ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌పై ఆధారపడి ఉన్నారు. ఇటీవల దొంగతనాలు గొడవలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు పోలీస్ స్టేషన్ ఫోన్ చేయగా ల్యాండ్ ఫోను మూడు నెలలుగా పని చేయడం లేదు. దీనిపై ద్రాక్షారామ ఎస్ఐ వినోద్‌ను వివరణ కోరగా బిఎస్ఎన్ఎల్ కార్యాలయానికి ఫిర్యాదు చేశామని తెలిపారు. ఎంతో ఉపయోగకరంగా ఉండే ల్యాండ్ ఫోన్ పనిచేయకపోతే ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని పరిసర ప్రాంతం ప్రజలు కోరుతున్నారు. మంగళవారం రాత్రి స్టేషన్ వెనకాల గల గాంధీనగర్ ఎస్సి పేటలో దొంగలు ప్రవేశించినప్పుడు పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసినా ఆ ఫోన్ పని చేయకపోవడం వల్ల ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడిందని బాధితులు తెలిపారు. వెంటనే ల్యాండ్ ఫోను పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని లేదా ప్రత్యామ్నాయంగా వేరే ఫోన్ ఏర్పాటు చేయాలని పరిసర ప్రాంతాలు ప్రజలు కోరుతున్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఆలమూరు

జనసేన పార్టీ కార్యకర్తల సేవలు అభినందనీయమని పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో జనసైనికుల ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి మంచి కార్యక్రమాలకు తన వంతు సాయం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సూరపురెడ్డి సత్య, బి.రాంబాబు, చల్లా బాబి, చల్లా వీరేంద్ర ప్రసన్నకుమార్, కట్టరాజు, చల్లా వెంకటేశ్వర్లు, కళ్లెం రాజు, సిరిగినీడి పట్టాభి, బండారు త్రిమూర్తులు, తదితర జన సైనికులు పాల్గొన్నారు.

మండల పరిషత్‌కు వాటర్ కూలర్ అందజేత

రామచంద్రపురం : రామచంద్రపురం మండల పరిషత్ కార్యాలయానికి రూ.15 వేల విలువైన వాటర్ కూలర్‌ను ఎఒ సిహెచ్‌విఎఆర్.సుబ్రమణ్యం బుధవారం అందజేశారు. ఆయన పెళ్లిరోజు సందర్భంగా దీనిని మండల పరిషత్ కార్యాలయానికి సమర్పించినట్లు వివరించారు. మండల పరిషత్ కార్యాలయానికి నిత్యం అనేకమంది వివిధ పనుల కోసం వస్తుంటారని వారందరికీ మంచినీటిని అందించాలనే సదుద్దేశంతో వాటర్ కూలర్ ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు

మహానాడు జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-మండపేట

రాజమహేంద్రవరంలో ఈ నెల 27, 28 తేదీల్లో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న టిడిపి మహానాడును కార్యకర్తలంతా విజయవంతం చెయ్యాలని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. 27న పార్టీ ప్రతినిధులతో, 28న మధ్యాహ్నం 3.00 గంటలకు బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు.

వాలంటీర్లన సన్మానిస్తున్న వైసిపి నాయకులు

సేవలకు గుర్తింపుగా వాలంటీర్లకు సన్మానం

ప్రజాశక్తి-కొత్తపేట

ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా వానపల్లి సొసైటీలో వాలంటీర్లకు బుధవారం సన్మానం నిర్వహించారు. పంచాయతీ సెక్రెటరీ వివి.రామన్న అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపిపి మార్గాన గంగాధర్, జెడ్‌పిటిసి గూడపాటి రమాదేవి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. వానపల్లి సచివాలయం-1 బండారు దుర్గ లక్ష్మీ భవాని, సచివాలయం-3 ముళ్ల నాగ దుర్గాదేవి సేవా రత్న అవార్డ్, రూ.20 వేల నగదు, సేవా మిత్ర అవార్డు రూ.పది వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో బండారు సత్తిరాజు, వైసిపి నాయకులు గొల్లపల్లి శ్రీను, నాయకులు ఇసుకుపట్ల సునీల్, ముత్యాల వెంకటేశ్వరరావు, సాకా జానకిరామయ్య, గుత్తుల సాయి బాబు, ఇళ్ల శ్రీరాములు పాల్గొన్నారు.

మహారాజశ్రీ మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి
రాజమహేంద్రవరం
O.S.No. 479/2022

Between:
ముళ్ళపూడి వెంకట్రావు ...వాది
మరియు
పీసపాటి రజనీకుమారి @ ముళ్ళపూడి రజనీకుమారి మరియు ఇతరులు ...ప్రతివాదులు

ప్రతివాది నెం.2:
పీసపాటి పుష్ప సీతారామ సత్యసాయి ఈశ్వర కుమార్ @ పీసపాటి సాయికుమార్, తండ్రి: కృష్ణమూర్తి (లేటు), డో.నెం.6-21-5, మరగంటి వారి వీధి, ఇన్నీస్‌పేట రాజమండ్రి.

పై గ్రంధమునందు రెండవ ప్రతివాదికి శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్ని నోటీసులు పంపిననూ నిరాకరించుచున్న కారణముగా శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు ఆర్డరు వేసియున్నారు. సదరు గ్రంధము వాయిదా ది.14-06-2023 సం॥రం తేదీన అయి ఉన్నది. సదరు తారీఖున అనగా **ది.14-06-2023 సం॥రం ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారి ముందు హాజరయ్యి మీ అభ్యంతరములు తెలుపగలరు.** లేనిచో పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి, 24-5-2023.
ఏ.శ్రీనివాసరావు
అడ్వకేట్, రాజమండ్రి.
సెల్: 90304 69808

మహారాజశ్రీ 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు మరియు ఫ్యామిలీ కోర్టు, రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా
F.C.O.P.No. 270/2022

Between:
నగం రాజకుమారి అలియాస్ చింతనీడి రాజకుమారి ...పిటీషనరు
మరియు
నగం నాగేశ్వరరావు, S/o. నగం రాణి, హిందువు, వయస్సు 42, డో.నెం. 40-5-5/1,శ్రీమంతరావు బిల్డింగ్, రాజ్యలక్ష్మి హాస్పటల్ ప్రక్కన, మంగళవారపు పేట, రాజమహేంద్రవరం అర్బన్, తూ॥గో॥జిల్లా. ...రెస్పాండెంటు

పై నెంబరు డైవర్స్ ఓ.పి.లో రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు /నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది.31-05-2023 సం॥రం తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరు అయ్యి సదరు పై పిటీషనులో మీ ఆక్షేపణలను తెలుపు కొనవలెను.** లేని ఎడల సదరు పిటీషను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి, 24-5-2023.
కె.రవీంద్రనాథ్
అడ్వకేట్, రాజమండ్రి.
సెల్: 98496 87433

మహారాజశ్రీ మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి
రాజమహేంద్రవరం
I.A.No. 85/2022
O.S.No. 479/2022

Between:
ముళ్ళపూడి వెంకట్రావు ...పిటీషనరు/వాది
మరియు
పీసపాటి రజనీకుమారి @ ముళ్ళపూడి రజనీకుమారి మరియు ఇతరులు ...రెస్పాండెంట్సు /ప్రతివాదులు

రెస్పాండెంటు /ప్రతివాది నెం.2:
పీసపాటి పుష్ప సీతారామ సత్యసాయి ఈశ్వర కుమార్ @ పీసపాటి సాయికుమార్, తండ్రి: కృష్ణమూర్తి (లేటు), డో.నెం.6-21-5, మరగంటి వారి వీధి, ఇన్నీస్‌పేట, రాజమండ్రి.

పై గ్రంధమునందు రెండవ రెస్పాండెంటు /ప్రతివాదికి శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్ని నోటీసులు పంపిననూ నిరాకరించుచున్న కారణముగా శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు ఆర్డరు వేసియున్నారు. సదరు గ్రంధము వాయిదా ది.14-06-2023 సం॥రం తేదీన అయి ఉన్నది. సదరు తారీఖున అనగా **ది.14-06-2023 సం॥రం ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారి ముందు హాజరయ్యి మీ అభ్యంతరములు తెలుపగలరు.** లేనిచో పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి, 24-5-2023.
ఏ.శ్రీనివాసరావు
అడ్వకేట్, రాజమండ్రి.
సెల్: 90304 69808